క్లుప్తంగా

దరఖాస్తులను పకడ్బందీగా ఆన్‌లైన్ చేయాలి



దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

సూర్యాపేట రూరల్ : ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను పకడ్బందీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదును ఆయన పరిశీలించి మాట్లాడారు. నమోదులో అవకతవకలు జరగకుండా సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ పరంకుశరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై గ్రామసభ



కోదూరు గ్రామసభలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

అర్వపల్లి : మండలంలోని కోదూరులో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులకు గాను సామాజిక తనిఖీ చేపట్టేందుకు మంగళవారం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో చేపట్టిన పనులపై సభలో ప్రజలకు వివరించారు. ఇంటింటికి తనిఖీ బృందం తిరిగి పనులపై ఆడిట్ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ సీహెచ్.ఉపేందర్, ఎస్ఆర్‌పీ కల్యాణి, సర్పంచ్ గుయ్యని బాబు, డీఆర్‌పీ స్వాతి, టీఏ నాగమణి, పంచాయతీ కార్యదర్శులు జ్యోతిరెడ్డి, రజిత, ఫీల్డ్ అసిస్టెంట్ నిద్ర సుజాత, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

చివ్వెంల(సూర్యాపేట) : మండలంలోని బి.చందుపట్ల గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చైతన్య యువజన మండలి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులచే నిర్వాహకులు ప్రారంభింపజేశారు. ఈనెల 16వరకు జరగనున్న పోటీల్లో ఆసక్తి ఉన్న వారు తమ జట్టు పేరు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో చైతన్య యువజన మండలి గౌరవ అధ్యక్షుడు అనంతుల మధు, అధ్యక్షుడు భాష్పంగు సునీల్, కార్యదర్శి కొలికపంగు వాసు, ఎంపీటీసీ కోడి బండ్లయ్య, సీతారామారావు, కోడి సురేష్, కోడి లక్ష్మణ్, కెయ్యాల రాజ్‌కుమార్, శ్రావణ్, నాగునాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నర్సింహస్వామి సింహాసనోత్సవం



నర్సింహస్వామిని సింహాసనంపై ఉంచి పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం నర్సింహస్వామి అమ్మవార్ల విగ్రహాలను సింహాసనంపై ఉంచి సింహాసనోత్సవాన్ని నిర్వహించారు. అలాగే స్వామికి విశేష పూజలు జరిపి మంగళహారతులు ఇచ్చి మహిళలు గోదాదేవికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

నాగారం : కాంగ్రెస్ ప్రవేశపెట్టిన గ్యారంటీ పథకాలకు దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేపట్టాలని సీపీఎం మండల అధ్యక్షుడు కడియం కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు పూర్తికాగానే అధికారులు ఇంటింటి సర్వే చేపట్టి లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలన్నారు. గత ప్రభుత్వం లాగా ఆ పార్టీ వారికే కాకుండా అర్హులైన వారిని ఎంపిక చేయాలన్నారు. ఆయన వెంట రాములు, ఎల్లయ్య, మహేందర్, మారయ్య ఉన్నారు.

అసంపూర్తిగా నిర్మాణ పనులు

- నిధులు అందక నిలిచిన పల్లె దవాఖానాల భవనాల నిర్మాణం
- అదనపు నిధులు మంజూరు చేయాలని వినతి



కొమ్మాలలో అసంపూర్తిగా నిలిచిన పల్లెదవాఖాన భవన నిర్మాణం



తిమ్మాపురంలో..

అర్వపల్లి : గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ఆయా గ్రామాల్లో పల్లె దవాఖానాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా పలు గ్రామాల్లో పల్లెదవాఖానాల కోసం సొంత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో గ్రామాల్లో భవనాల నిర్మాణాల పనులు ప్రారంభించారు. ప్రస్తుతం నిర్మాణ పనులు నిధులలేమితో అసంపూర్తిగా నిలిచిపోయాయి. జాజిరెడ్డిగూడెం మండలంలో 5పల్లె దవాఖానాలు ఉండగా కాసర్లపహాడ్‌లో ఇటీవల భవన నిర్మాణాన్ని చేపట్టారు. అలాగే కోడూరులో జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా రూ.13లక్షలు మంజూరు కాగా ఏడాదిన్నర కిందట పనులు ప్రారంభించారు. అయితే ఇక్కడ నిధుల సమస్య లేకపోయినప్పటికీ నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతుంది. ఇక తిమ్మాపురం, కొమ్మాల గ్రామాల్లో భవన నిర్మాణాల పని పూర్తి చేయడానికి నిధులు చాలకపోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయాయి. జాజిరెడ్డిగూడెంలో పల్లె దవాఖాన భవనం పూర్తిగా శిథిలమైంది. ఇక్కడ నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు కావాల్సి ఉంది.

డీఎంఎఫ్ నిధులు చాలక నిలిచిన పనులు..

కొమ్మాలలో జిల్లా మినరల్ ఫండ్ నిధులు రూ.7లక్షలతో పల్లె దవాఖాన భవన నిర్మాణాన్ని చేపట్టారు. ప్రస్తుతం ఉన్న నిధుల వరకు పనులు చేశారు. భవనంలో ఇంకా చిన్నచిన్న పనులు చేపట్టాల్సి ఉంది. తిమ్మాపురంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ కూడా నిధులు చాలక పనులు ఆగాయి. ఈ రెండు గ్రామాల్లో అదనపు నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ నిధులు మంజూరైతేనే ఈ రెండు భవనాల పనులు పూర్తి కానున్నాయి. కాగా అదనంగా మరో రూ.5లక్షలు మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించారు. వెంటనే నిధులు మంజూరు చేసి భవన నిర్మాణ పనులు పూర్తి చేయించి వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు, వైద్యసిబ్బంది కోరుతున్నారు.

పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



కొమ్మాల గ్రామంలో పల్లె దవాఖాన భవన నిర్మాణ పనులు కొంతకాలంగా అసంపూర్తిగా ఆగిపోయాయి. ప్రస్తుతం పల్లె దవాఖానను గ్రామపంచాయతీ కార్యాలయంలోని ఓ గదిలో నిర్వహిస్తున్నారు. అదనపు నిధులు మంజూరు చేసి భవన నిర్మాణ పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలి.

– బౌరోజు ఉపేందర్, కొమ్మాల

అదనపు నిధులకు ప్రతిపాదనలు పంపాం



కొమ్మాల, తిమ్మాపురం గ్రామాల్లో పల్లె దవాఖాన భవనాల నిర్మాణ పనులు పూర్తి చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. కొమ్మాల, తిమ్మాపురంలలో ఒక్కో భవనం పూర్తిచేయడానికి ఇంకా సుమారు రూ.2.50లక్షల చొప్పున మొత్తం రూ.5లక్షల నిధులు కావాల్సిఉంది. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకాగానే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తాం

– అశోక్, పీఆర్ ఏఈఈ

శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలి



సైన్స్‌ఫేర్‌లో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

చివ్వెంల(సూర్యాపేట) : విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ యాదయ్య అన్నారు. మంగళవారం జన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలలో నిర్వహించిన జన్య సైంటిఫిక్ రంగోలి, సైన్స్‌ఫేర్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోధన పరికరాల ద్వారా తరగతి గదిలో కృత్యాల ద్వారా నేర్చుకున్న సైన్స్ అండ్ మ్యాథ్స్ అంశాలకు విద్యార్థులు ముగ్గుల రూపంలో ప్రదర్శించారు. ఇలాంటి వినూత్న కార్యకమాలు విద్యార్థుల బోధన పెంపొందేందుకు దోహదపడతాయని ఫౌండేషన్ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండలంలోని అనంతారంలో గల మోడల్‌స్కూల్‌లో 2024–25కు గాను 6వ తరగతిలో వంద సీట్లకు, 7వ తరగతి నుంచి 10వతరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వేముల బాలరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్ష ఫీజుగా జనరల్ విద్యార్థులకు రూ.200, బీసీ, ఎస్సీ, ఎస్టీ దివ్యాంగులకు, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ.125చెల్లించాలన్నారు. ప్రవేశాలకు ఈనెల 12నుంచి ఫిబ్రవరి 22వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు అక్షర సంక్రాంతి సంబరాలు



కరపత్రాలు విడుదల చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట పట్టణంలోని మినీ ట్యాంక్‌బండ్ వద్ద నేడు (బుధవారం) అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్షర సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ యాస రాంకుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో అక్షర సంక్రాంతి సంబరాల కరపత్రాలు ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఈ సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలు, కోలాటం, గాలిపటాలు ఎగురవేయుట, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసు కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 4గంటలకు సంబరాలు ప్రారంభమవుతాయన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 70362 59911ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు ఉప్పు నాగయ్య, నరాల తిరుమలరెడ్డి, రుద్రంగి కాళిదాసు, కందాల వెంకట్‌రెడ్డి, బత్తుల ఉపేందర్, సైదులు, వెంకన్న, శంకర్‌రెడ్డి, నజీర్‌బాషా, ఉపేంద్రాచారి, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపర్చాలి



ఉపాధ్యాయుల బోధనను పరిశీలిస్తున్న నోడల్ అధికారి వస్రాంనాయక్

పెన్‌పహాడ్ : విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపర్చాలని మండల నోడల్ అధికారి వస్రామ్‌నాయక్ అన్నారు. మంగళవారం ఎఫ్ఎల్ఎన్ మానిటరింగ్‌లో భాగంగా మండలంలో పలు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాల్లో విద్యార్థుల ప్రగతిని, రికార్డ్స్, టీఎల్ఎం, ఉపాధ్యాయుల బోధన తీరును ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయా పాఠశాలల హెచ్ఎంలకు, ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. ఎఫ్ఎల్ఎన్‌లో ఉపాధ్యాయులందరూ పాఠ్యపుస్తకాలను బోధన ప్రణాళికను, విద్యార్థుల వర్క్‌బుక్స్‌ని సమన్వయం చేసుకుంటూ బోధన చేయాలని, టీఎల్ఎమ్‌ను ఎక్కువగా తయారు చేసుకోని తద్వారా విద్యార్థులకు మంచి బోధన అందించాలని సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు సంధ్యాల వినోద్, వాణి, రాంజీ, రమేష్, చంద్రశేఖర్, శ్రీకాంత్, శైలజ, బ్రహ్మాచారి, సైదిరెడ్డి, గవాస్కర్‌రెడ్డి, నిర్మల ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేపట్టాలి



తిరుమలగిరి (తుంగతుర్తి) : మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్



నూతనకల్ : జయమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ నర్సయ్యగౌడ్

తిరుమలగిరి (తుంగతుర్తి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టాలని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ కోరారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన పీఎం విశ్వకర్మ యోజన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మూడోసారి నరేంద్రమోదీ ప్రధాని అవుతారని అన్నారు. కుల వృత్తులను గౌరవించాలని, కుల వృత్తే మన దైవమన్నారు. విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బీజేపీ వస్తేనే ప్రజలందరికీ మంచి భవిష్యత్ ఉంటుందని, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి సంక్షేమ పథకాలు అమలు చేయడానికి వంద రోజుల సమయం ఇస్తామని, పథకాలు అమలు చేయకుంటే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. బూత్ కమిటీలను బలోపేతం చేయాలన్నారు. సమావేశంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య, జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యారెడ్డి, కాప రవికుమార్, వై.ధీన్‌దయాళ్, మల్లెపాక సాయిబాబా, ఎం.యాదగిరి, మూల వెంకట్‌రెడ్డి, ఈదునూరి జ్యోతి, రాముయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పట్టణంలో ఆర్‌కే యువభారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సామాజిక సేవా కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ కన్నెబోయిన రాముయాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య, సాయిబాబా, ధీన్‌దయాళ్, రవి, హన్మంతు, చిరంజీవి, మహేందర్, సోమయ్య, బంగార్రాజు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం బీజేపీతోనే సాధ్యం

నూతనకల్ : ప్రజా సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు బూర నర్సయ్యగౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని ప్రతి గ్రామం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి చెందుతున్నాయన్నారు. సీసీరోడ్లు, శ్మశాన వాటికలు, రైతువేదిక నిర్మాణాల కోసం కేంద్రమే నిధులు కేటాయించినట్లు ఆయన తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి దేశాభివృద్ధి కోసం సహకరించాలని కోరారు. మండల కేంద్రంలోని చిరు వ్యాపారస్తులను కలిసి కేంద్ర పథకాలను వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య, కన్వీనర్ కాప రవికుమార్, మండల అధ్యక్షుడు మద్ది సంజీవరెడ్డి, భూతం సాగర్, బత్తిని లింగయ్య, రమేష్ పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

మండల కేంద్రానికి చెందిన మారగాని జయమ్మ ఇటీవల మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబాన్ని మంగళవారం మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న బీజేపీ నాయకుడు బీమిడి రాంరెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య, కాప రవికుమార్, మద్ది సంజీవరెడ్డి, ఒంగూరి రమేష్, బత్తిని లింగయ్య తదితరులు ఉన్నారు.

ఇంటింటికీ శ్రీరాముడి అక్షింతల పంపిణీ



పెన్‌పహాడ్‌లో అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు

పెన్‌పహాడ్ : అయోధ్య శ్రీరాముడి అక్షింతలను మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి అక్షింతలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రంగినేని వనమ్మ, ప్రభావతి, లక్ష్మణ్‌రావు, మంజుల, ఊర్మిళ, రంగినేని భారతి, లక్ష్మీకాంతరావు, మాధవి, అనిత, శ్రీలత, పురుషోత్తం, సత్యనారాయణ, జయరాం తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను మంగళవారం మండల పరిధిలోని కొమ్మాల గ్రామంలో భక్తులు ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకుడు దరూరి జగన్నాధచార్యులు, బుర్ర జనార్దన్, ఉపసర్పంచ్ కుంట్ల రేణుకగోవర్ధన్‌రెడ్డి, బౌరోజు ఉపేందర్, భస్వర్ ఉపేందర్, కుంటిగొర్ల సాయి, నవీన్, అక్షయ్, శ్రీకాంత్, భక్తులు, అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.



అర్వపల్లి : అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ సైదులుగౌడ్

నాగారం : గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడల్లో రాణించాలని స్థానిక ఎస్ఐ సైదులుగౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఈటూరులో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు శారీరక ధృడత్వానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పేరాల సరితయాదగిరి, కూరం వెంకన్న, అంబేద్కర్ యువజన సభ్యులు, క్రీడల నిర్వాహకులు యల బాబు, వంగూరి సందీప్, బుడిద గణేష్, గట్టగళ్ల సుధాకర్, ఎల్లి అనిల్, ఉదయ్‌కిరణ్, బొట్టు మహేష్, వంగూరి సురేష్, బొట్టు సురేష్, మచర్ల వెంకన్న, పోలేపాక మహేష్, కాశీం, బొల్లెద్దు సురేష్, నరేష్, మధు, రాజేష్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



సీహెచ్.సోమయ్య



వీఎల్ఎన్ చార్యులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండల కేంద్రంలో టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చల్లగుండ్ల సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా వీఎల్ఎన్ చార్యులు, కోశాధికారిగా బి.మహేష్, మహిళా ఉపాధ్యక్షులుగా పి.నాగమ్మ, కాటి వెంకటయ్య ఎన్నికయ్యారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.సోమయ్య, యాదయ్య, నాగు వెంకన్న, మారయ్య తదితరులు ఉన్నారు.

ఎస్టీవో కార్యాలయం ప్రారంభమెప్పుడో..



తుంగతుర్తిలో నూతనంగా నిర్మించిన ఎస్టీవో కార్యాలయ భవనం

తుంగతుర్తి : నియోజకవర్గ కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎస్టీవో కార్యాలయ భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఈ కార్యాలయాన్ని రూ.15లక్షలతో రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించి, గత ఏడాది భవన నిర్మాణం పూర్తి చేశారు. పూర్తయి ఏడాది గడిచినా నేటికి ప్రారంభానికి నోచుకోవడంలేదు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఎస్టీవో కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. అయినా ఆ శిథిల భవనంలోనే ఇరుకు గదుల మధ్య సిబ్బంది విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. లక్షలు వెచ్చించి నిర్మించినా నూతన భవనాన్ని ఎందుకు ప్రారంభించడంలేదో.. ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు ఎస్టీవో కార్యాలయ భవనాన్ని ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లో 2005–2006లో పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు మంగళవారం అర్వపల్లిలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 18ఏళ్ల తర్వాత విద్యార్థులు కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సరదగా గడిపారు. అలాగే తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కొంతమంది విద్యార్థులు ఆకాల మరణం చెందగా వారిని గుర్తుచేసుకుంటూ, వారి కుటుంబాలను ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో పాఠశాల రిటైర్డ్ హెచ్ఎం కర్నాటి రంగయ్య, ఉపాధ్యాయులు భారతి, రమాదేవి, సోమయ్య, ఎస్. వెంకట్‌రెడ్డి, లక్ష్మి, పీఈటి శ్రీను, విద్యార్థులు ఉన్నారు.

15న వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవాలు

అర్వపల్లి : మండలంలోని తిమ్మాపురంలో శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఈనెల 15న స్వామివారి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా గణపతిపూజ, స్వామి అభిషేకం, కుంకుమార్చనలు, స్వామి ఆరాధన పూజ, గ్రామంలో స్వామివారి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న సురేష్‌రావు

పెన్‌పహాడ్ : మండల కేంద్రానికి చెందిన మండవ శైలజ పూరిగుడిసె ఇటీవల షార్ట్‌సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. దీంతో మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట శెనగాని రాంబాబుగౌడ్, షేక్ సైదులు, మామిడి వెంకన్న, దండెంపల్లి దేవేందర్, సైదులు, వెంకన్న, ఒగ్గు జానయ్య, శ్రీకాంత్, మామిడి శ్రవణ్, పేరూరి వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

అర్వపల్లి : నల్లగొండ–ఖమ్మం–వరంగల్ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు నియోజకవర్గ పరిధిలోని పట్టభద్రులు ఓటర్‌గా నమోదు చేసుకోవాలని తెలంగాణ ఉద్యమకారుడు, కాంగ్రెస్ నాయకుడు వేముల గోపినాథ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2023 నవంబర్ 1నాటికి డిగ్రీ పూర్తై మూడేళ్లు నిండిన పట్టభద్రులు ఫారం–18ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 6వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. డిగ్రీ సర్టిఫికెట్, ఆధార్, ఓటర్ కార్డు, పాస్‌ఫొటోతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి ఆ దరఖాస్తు ఫారంపై గెజిటెడ్ అధికారితో సంతకం చేయించి తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా వెంకటేశ్‌యాదవ్

మేళ్లచెరువు : మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన జక్కుల వెంకటేష్‌యాదవ్ స్పోర్ట్స్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎస్ఎస్ఎఫ్) రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఓయూలో నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర చాగంటి రాజేష్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ.. ఎంపీఈడీ పూర్తి చేసిన వెంకటేష్ యాదవ్ క్రికెట్, లాంగ్ జంప్ వంటి పోటీల్లో రాష్ట్ర స్థాయిలో పాల్గొన్నట్లు, అదే విధంగా యువ క్రీడాకారులకు మార్గదర్శంగా ఉంటూ వారికి తగిన సలహాలు, సూచనలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

గీతకార్మికుల కుటుంబాలకు అండగా ఉంటా



గీతకార్మికుడిని పరామర్శిస్తున్న కేఎల్ఎన్ ప్రసాద్

కోదాడరూరల్ : కల్లుగీత కార్మికుల కుటుంబాలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటానని కౌండిన్య సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ కేఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దోరకుంటకు చెందిన గీత కార్మికుడు ఎడవల్లి వాసు తాటిచెట్టుపై నుంచి పడి గాయపడడంతో ఆయనను కోదాడ ప్రభుత్వ ఆస్పత్రిలో పరామర్శించారు. గాయపడిన కార్మికుడికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో వెంటనే వచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. తనవంతుగా కూడా సహాయ సహకారాలు అందజేస్తానని, ఎక్సైజ్ అధికారులు ఎక్స్‌గ్రేషియాకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించాలని ఆయన కోరారు. ఆయన వెంట ఐల రమేష్‌గౌడ్, కృష్ణగౌడ్ ప్రారంభించారు.